నమస్తే తెలంగాణ
సిద్దిపేట
13 | హైదరాబాద్, శుక్రవారం 15 మార్చి 2024 | SIDDIPET

సిద్దిపేట ఎల్లమ్మ దేవాలయం వద్ద అసంపూర్తి పనులతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు

కంకర వేశారు.. తారు మరిశారు!

సిద్దిపేట ఎల్లమ్మ దేవాలయం నుంచి చిన్నకోడూరు వరకు నత్తనడకన రహదారి విస్తరణ పనులు

- మూడు నెలలుగా పనుల్లో పురోగతి లేదు..
- కంకర రాళ్లు, దుమ్ముతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- ప్రమాదాల బారిన వాహనదారులు, ప్రయాణికులు
- నిధ్రమత్తు వీడని ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్
- తక్షణమే తారుపోయాలని వాహనదారుల డిమాండ్

సిద్దిపేట, మార్చి 14(నమస్తే తెలంగాణ ప్రతినిధి): సిద్దిపేట ఎల్లమ్మ దేవాలయం నుంచి చిన్నకోడూరు మండల కేంద్రం వరకు చేపట్టిన రహదారి విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డును తవ్వి కంకర, చిప్స్ పరిచారు. కల్వర్టుల నిర్మాణం చేపట్టారు. కొంతదూరం మధ్యలో డివైడర్ సైతం ఏర్పాటు చేశారు. మొదట్లో పనులు స్పీడుగా జరిగాయి. ఆ తర్వాత నెమ్మదించాయి. మూడు నెలలుగా పనుల్లో పురోగతి లేదు. కేసీఆర్ ప్రభుత్వంలో సిద్దిపేట ఎల్లమ్మ దేవాలయం నుంచి చిన్నకోడూరు మీదుగా ఇల్లంతకుంట వరకు దాదాపు 32 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులకు సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ వినతి మేరకు అప్పటి సీఎం కేసీఆర్ రూ. 254 కోట్లు మంజూరు చేశారు. ఈ రహదారి విస్తరణ పనులను త్వరగా పూర్తి చేసేందుకు మూడు బిట్లుగా విభజించారు. శాసనసభ ఎన్నికల ముందు సిద్దిపేట నుంచి చిన్నకోడూరు వరకు విస్తరణ పనులు మొదలుపెట్టి పనులు వేగంగా జరిపించారు. ఎన్నికలు పూర్తయి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చిన్నకోడూరు నుంచి ఇల్లంతకుంట వరకు రెండు బిట్ల పనులను రద్దు చేసింది. సిద్దిపేట ఎల్లమ్మ దేవాలయం నుంచి చిన్నకోడూరు వరకు రహదారి విస్తరణ పనుల్లో జాప్యం జరుగుతున్నది. ఫలితంగా దుమ్ముతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలు వచ్చి పోయినప్పుడు విపరీతంగా దుమ్ము లేచి రోడ్డు పక్కన షాపుల్లోకి, ఇండ్లలోకి వెళ్తున్నది. తద్వారా ప్రజలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. చిన్నచిన్న కంకర రాళ్లు పైకి ఎగిరి పడుతుండడంతో గాయాల పాలవుతున్నారు. కంకరతో వాహనాలు స్కిడ్ అయి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల ఓ కారు అదుపుతప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి డికొట్టింది. నిత్యం ఏదో ఒక సంఘటన జరుగుతూనే ఉన్నది. ఇదంతా జరుగుతున్నప్పటికీ రోడ్లు భవనాలశాఖ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ రహదారిపై ప్రయాణం అంటేనే నరకం కనిపిస్తున్నది. ఉదయం, సాయంత్రం వేళ తూతూమంత్రంగా ట్యాంకర్‌తో నీళ్లు పట్టి చేతులు దులుపుకొంటున్నారు. రోడ్డుపై వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండడంతో నీళ్లు చల్లిన అరగంట కాగానే ఎప్పటి లాగానే మళ్లీ విపరీతంగా దుమ్ము లేస్తున్నది. వాహనాలు వెళ్లినప్పుడు విపరీతంగా దుమ్ము లేవడంతో కనీసం ఎదురుగా వస్తున్న ఇతర వాహనాలు కనిపించడం లేదు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ముక్కుకు మాస్క్ ధరించి పోవాల్సి వస్తున్నది. రోడ్డు వెంట ఉన్న కొంతమంది షాపుల యజమానులు వారి దుకాణాల ఎదుట ప్రతి అరగంటకు ఒక్కసారి నీటిని కొట్టుకుంటున్నారు. దుమ్ము, కంకర రాళ్లు, చిప్స్‌తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనుల్లో సైతం నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. రోడ్డు విస్తరణలో భాగంగా ఏర్పాటు చేసే డివైడర్‌లకు కనీసం వాటర్ క్యూరింగ్ చేయడం లేదు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి వెంటనే తారువేసి ఇక్కట్లను తొలిగించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్డు పనుల కారణంగా తన షాపు ముందు దుమ్ము లేవకుండా నీళ్లు చల్లుతున్న యజమాని

అసంపూర్తి రహదారి విస్తరణ పనుల కారణంగా దుమ్ముతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు


దుబ్బాక మున్సిపల్ పరిధిలోని దుబ్బాక, మల్లాయిపల్లి, కమ్మర్‌పల్లి శివారులో నిర్మిస్తున్న 4ఎల్ డిస్ట్రిబ్యూషన్ కాల్వ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మల్లన్నసాగర్ ఉప కాల్వల నిర్మాణం

వేగంగా చేపట్టాలి

- సాగునీటి సమస్యను పరిష్కరిస్తాం
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- దుబ్బాకలో 4ఎల్ డిస్ట్రిబ్యూషన్ కాల్వల పరిశీలన

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక,మార్చి 14 : మల్లన్నసాగర్ ఉప కాల్వల నిర్మాణ పనులను వేగంగా చేపట్టి, రైతులకు సాగునీటి కష్టాలను తొలిగించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. దుబ్బాక మండలంలో మల్లన్నసాగర్ 4ఎల్ డిస్ట్రిబ్యూషన్ కాల్వల నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. 4ఎల్ డిస్ట్రిబ్యూషన్ కాల్వల ద్వారా దుబ్బాక మండలం, మున్సిపాలిటీలో 11 గ్రామాల రైతులకు సాగునీటి సరఫరా కానున్నది. మల్లన్న సాగర్ ప్రధాన కాల్వ దుబ్బాక నియోజకవర్గం మీదుగా పక్కనున్న రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మానేరు ప్రాజెక్టు వరకు అనుసంధానం చేశారు. ఈ ప్రధాన కాల్వ నుంచి 4ఎల్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా దుబ్బాక మండలంలో 11 గ్రామాలకు ఉప కాల్వలను నిర్మిస్తున్నారు.ఉప కాల్వల నిర్మాణ పనులు పలుచోట్ల నిలిచిపోవడంతో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి స్పందించారు. నీటి పారుదలశాఖ అధికారులు, మెగా కాంట్రాక్టు సిబ్బందితో కలిసి ఉప కాల్వల నిర్మాణ పనులను పరిశీలించారు. సమస్యాత్మక ప్రదేశాలను పరిశీలించడంతో పాటు స్థానిక రైతులతో ఎమ్మెల్యే చర్చించారు. కాల్వల నిర్మాణ పనులను అడ్డుకోవద్దని కోరారు. ఆనంతరం నీటి పారుదల శాఖ ఎస్ఈ బసవరాజు, ఈఈ వేణుబాబు, డీఈ శ్రీధర్, ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి, మెగా కాంట్రాక్టు సిబ్బందితో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. మల్లన్న సాగర్ ఉప కాల్వల నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం వహించవద్దని, త్వరితగతిన పూర్తిచేసి సాగునీరు అందించాలన్నారు. రైతులకు పరిహారం వెంటనే అందించి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.

4ఎల్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా 30 వేల ఎకరాలకు సాగునీరు

మల్లన్నసాగర్ ప్రధాన కాల్వ నుంచి దుబ్బాక నియోజకవర్గంలోని 4ఎల్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా 15 కి.మీ పొడవు ఉప కాల్వ నిర్మాణ పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ ఉప కాల్వల ద్వారా 11 గ్రామాల్లో 30వేల ఎకరాలకు సాగునీరు అందనుందని తెలిపారు. పలుచోట్ల పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే ప్రారంభించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశించామన్నారు. ఆయన వెంట కౌన్సిలర్లు యాదగిరి, శ్రీనివాస్, స్వామి బీఆర్ఎస్ నాయకులు కొత్త కిషన్‌రెడ్డి, గన్నే భూంరెడ్డి, మూర్తి శ్రీనివాస్‌రెడ్డి, వంశీగౌడ్, రాంరెడ్డి పాల్గొన్నారు.

గౌరవెల్లి ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి

- ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం
- సమీకృత భవన సముదాయ ప్రతిపాదనలు సిద్ధం చేయండి
- పార్టీలకతీతంగా అభివృద్ధే లక్ష్యం
- రూ. 1.01 కోట్ల అభివృద్ధి పనుల శంకుస్థాపనలో మంత్రి పొన్నం ప్రభాకర్


అక్కన్నపేటలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అక్కన్నపేట, మార్చి 14: మండలంలోని గౌరవెల్లి ప్రాజెక్ట్‌పై ప్రత్యేక దృష్టి సారించామని, గత ప్రభుత్వంలోని ఆగిన పనులు పూర్తిచేసి మెట్ట ప్రాంతానికి సాగునీరందిస్తామని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం అక్కన్నపేట మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించిన సుమారు రూ. 1.01 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తుందన్నారు. మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం ఎంతగానో ఆదరణ పొంది విజయవంతంగా అమలు అవుతున్నదన్నారు. కుటుంబానికి రూ. 500 గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇండ్లు లేని పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు కట్టుకునే విధంగా ఆర్థిక సహాయం చేస్తామని తెలిపారు. కొత్తగా ఏర్పడిన అక్కన్నపేట మండలాన్ని పార్టీలకు అతీతంగా అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు చిత్తశుద్ధితో కృషిచేస్తానన్నారు. మండల కేంద్రంలో సమీకృత భవన సముదాయ నిర్మాణాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి, ఎంపీపీ మాలోతు లక్ష్మీబీలూనాయక్, జడ్పీటీసీ భూక్యమంగా, మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి, ఎంపీటీసీ పెసరు సాంబరాజు, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య, ఎంపీటీసీలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌కు రూ.3.40 కోట్లు మంజూరు

హుస్నాబాద్, మార్చి 14: హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లోని పలు హాబిటేషన్లకు మిషన్ భగీరథ కింద తాగునీటి పరఫరా పనుల నిర్వహణ కోసం రూ.3.40కోట్ల నిధులు మంజూరైనట్లు రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం ప్రకటనలో తెలిపారు. హుస్నాబాద్ మండలం పోతారం పరిధిలోని హనుమాన్ నగర్, కూచనపల్లి గ్రామ పరిధిలోని పునరావాస కాలనీకి తాగునీటి కోసం రూ.58లక్షలు, అక్కన్నపేట మండలంలోని కేశనాయక్‌తండా, బంజారాహిల్స్‌తండా, న్యూతండాలకు తాగునీటి సరఫరా కోసం రూ.1.23కోట్లు మంజూరయ్యాయి. కేశనాయక్‌తండా, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, సేవాలాల్‌తండాలకు అదనంగా రక్షిత నీరు అందించడం కోసం మరో రూ.1.58కోట్ల నిధులు విడుదలయ్యాయి. ఈ నిధులతో పనులు వెంటనే ప్రారంభించాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు.

నేటినుంచి ఒంటిపూట బడులు

- ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు తరగతులు

మెదక్ మున్సిపాలిటీ/రామాయంపేట/సంగారెడ్డి, మార్చి 14: వేసవి తీవ్రత నేపథ్యంలో శుక్రవారం నుంచి అన్ని పాఠశాలల్లో ఒంటిపూట తరగతులు నిర్వహించాలని విద్యాశాఖ ఈనెల 8న ఉత్తర్వులు జారీ చేసింది. మార్చి 15 నుంచి ఏప్రిల్ 24 వరకు జిల్లాలో ఒంటిపూట బడులు కొనసాగనున్నాయి. ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12.30 వరకు తరగతులు నిర్వహిస్తారు. ఆ తర్వాత విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తారు. ఈనెల 18నుంచి పదో తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో పదోతరగతి విద్యార్థులకు మాత్రం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు. పరీక్షలు నడిచే స్కూళ్లలో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5 వరకు పాఠశాలలు నడుస్తాయి. పరీక్షలు లేని పాఠశాలల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పాఠశాలలు నడుస్తాయి. పరీక్షలు రాసే పదోతరగతి విద్యార్థులు మినహా 1నుంచి 9తరగతుల విద్యార్థులు ఒంటిపూట బడులకు హాజరుకావాల్సి ఉంటుంది.

హ్యాట్రిక్ విజయమే లక్ష్యం

జహీరాబాద్‌లో గెలుపు కోసం బీఆర్ఎస్ కార్యాచరణ

- నియోజకవర్గాల వారీగా పార్టీ కార్యకర్తల సమావేశాలు
- పార్లమెంట్ పరిధిలో పర్యటనలకు అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ శ్రీకారం


గురువారం కామారెడ్డిలో బీఆర్ఎస్ నాయకులతో సమావేశమైన గాలి అనిల్ కుమార్

సంగారెడ్డి, మార్చి14(నమస్తే తెలంగాణ): జహీరాబాద్ పార్లమెంట్‌లో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ అడుగులు వేస్తున్నది. 2014, 2019 పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ నుంచి బీఆర్ఎస్ తరపున బీబీ పాటిల్ ఎంపీగా గెలుపొందారు. వచ్చే ఎంపీ ఎన్నికల్లో సైతం గెలిచి హ్యాట్రిక్ సాధించాలని బీఆర్ఎస్ పట్టుదలగా ఉంది. బీఆర్ఎస్ నుంచి తెలంగాణ ఉద్యమకారుడు, బీసీ నేత గాలి అనిల్‌కుమార్ పోటీ చేస్తున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, అందోలు, నారాయణఖేడ్ నియోజకవర్గాలు ఉన్నాయి. కామారెడ్డి జిల్లాలోని జుక్కల్, బాన్సువాడ, ఎల్లారెడ్డి, కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ బలంగా ఉంది. జహీరాబాద్ పార్లమెంట్‌కు సంబంధించి ప్రధాన రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించాయి. దీంతో ఇక్కడ జరిగే ఎన్నికలపై అందరి దృష్టి నెలకొంది. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా గాలి అనిల్‌కుమార్ పేరును అధినేత బుధవారం కేసీఆర్ ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సురేశ్ షెట్కార్ పేరును ఆ పార్టీ అధిష్టానం ప్రకటించింది. బీఆర్ఎస్ నుంచి రెండుసార్లు ఎంపీగా ఎన్నికైన బీబీ పాటిల్ ఇటీవల బీజేపీలో చేరారు. బీజేపీ బీబీ పాటిల్‌కు ఎంపీ టికెట్ ప్రకటించింది.

కాంగ్రెస్, బీజేపీలో అసంతృప్తి..

బీజేపీ, కాంగ్రెస్ పార్టీల్లో ఎంపీ టికెట్ ఆశించి భంగపడిన నేతలు అసంతృప్తితో ఉన్నారు. ఇది ఎన్నికల్లో పార్టీ విజయావకాశాలపై ప్రభావం చూపించనున్నది. కాంగ్రెస్ నుంచి జహీరాబాద్ ప్రాంతానికి చెందిన ఉజ్వల్‌రెడ్డితో పాటు కామారెడ్డి జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు ఎంపీ టికెట్ ఆశించారు. కాంగ్రెస్ అధిష్టానం నారాయణఖేడ్‌కు చెందిన మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్‌కు ఎంపీ టికెట్ ప్రకటించింది. ఎంపీ టికెట్ ఆశించిన ఉజ్వల్‌రెడ్డి ఇతర నేతలు పార్టీ తీరుపై అసంతృప్తితో ఉన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నందున తనకు విజయావకాశాలు ఉంటాయని సురేశ్ షెట్కార్ నమ్మకంగా ఉన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. దీనికి తోడు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పాలనపై ప్రజల్లో క్రమంగా వ్యతిరేకత వ్యక్తం అవుతున్నది. దీంతో కాంగ్రెస్ గెలుపు అంత సులువు కాదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. బీజేపీ నుంచి పదిమందికి పైగా నాయకులు జహీరాబాద్ ఎంపీ టికెట్ ఆశించారు. మాజీ ఎంపీ బాగారెడ్డి తనయుడు జైపాల్‌రెడ్డి, మాజీ ఎంపీ ఆలే నరేంద్ర కుమారుడు భాస్కర్, బద్దం బాల్‌రెడ్డి కుమారుడు మహిపాల్‌రెడ్డి, కామారెడ్డికి చెందిన పైడి ఎల్లారెడ్డి, సుభాష్‌రెడ్డి తదితరులు ఎంపీ టికెట్ ఆశించారు. బీజేపీ అధిష్టానం సొంత పార్టీ నేతలను కాదని బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్‌కు టికెట్ ఇచ్చింది. పార్టీ మారి వచ్చిన బీబీ పాటిల్‌కు టికెట్ ఇవ్వడంతో బీజేపీ అధిష్టానం తీరుపై ఎంపీ టికెట్ ఆశించిన నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అసంతృప్తి నేతలు ఎంపీ ఎన్నికల్లో బీబీ పాటిల్‌కు మద్దతుగా పనిచేసే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. మోదీ చరిష్మా, అయోధ్య రామమందిరం నిర్మాణం తనకు కలిసి వస్తాయని బీబీ పాటిల్ ధీమాగా ఉన్నారు. రెండు పర్యాయాలు ఎంపీగా ఎన్నికైన బీబీ పాటిల్ పనితీరుపై ప్రజల్లో అసంతృప్తి ఉంది. రెండు సార్లు ఎంపీగా ఉన్నా కేంద్రం నుంచి పెద్ద ప్రాజెక్టులు ఏవీ తీసుకు రాలేదని, అభివృద్ధి పనులు ఆశించిన స్థాయిలో చేయలేదని ఆయనపై ప్రజల్లో అసంతృప్తి ఉంది. దీనికి తోడు జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాలకు ఒక్క కామారెడ్డిలో మాత్రమే బీజేపీ ఎమ్మెల్యే ఉన్నారు. మిగతా నియోజకవర్గాల్లో బీజేపీ అంత బలంగా లేదు. దీంతో బీబీ పాటిల్ గెలుపు సులభతరం కాదన్న చర్చ సొంత పార్టీలోనే జరుగుతున్నది.

హ్యాట్రిక్ గెలుపుపై బీఆర్ఎస్ ధీమా

జహీరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని మూడోసారి కైవసం చేసుకుంటామన్న ధీమా బీఆర్ఎస్‌లో ఉంది. 2014, 2019 ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సైతం బీఆర్ఎస్ గెలుపుపై ధీమాగా ఉంది. జహీరాబాద్ ఎంపీ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ బలంగా ఉంది. దీనికి తోడు తెలంగాణ ఉద్యమకారుడు, బీసీ నేత గాలి అనిల్‌కుమార్‌కు బీఆర్ఎస్ టికెట్ ఇచ్చింది. గాలి అనిల్‌కుమార్ తెలంగాణ సాధన కోసం ఉద్యమించారు. బీఆర్ఎస్‌లో చురుగ్గా ఉన్నారు. ప్రజల కోసం పనిచేసే గాలి అనిల్‌కుమార్ గెలుపు కోసం ఇప్పటి నుంచే బీఆర్ఎస్ సిద్ధమవుతున్నది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలకు మార్గనిర్దేశం చేశారు. గాలి అనిల్‌కుమార్ గెలుపు కోసం బీఆర్ఎస్ కార్యాచరణ సిద్ధం చేసింది. మాజీ మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో జహీరాబాద్, అందోలు, నారాయణఖేడ్ ముఖ్యనేతలతో సమావేశాలు నిర్వహించారు. నారాయణఖేడ్, కామారెడ్డి, బాన్సువాడ నియోజకవర్గాల్లో కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ గురువారం కామారెడ్డి జిల్లాలో పర్యటించి పార్టీ నాయకులు, కార్యకర్తలను కలిశారు. త్వరలోనే జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ఆయన పర్యటించనున్నారు. ఎంపీ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడిన వెంటనే ప్రచార కార్యక్రమాలు నిర్వహించేందుకు బీఆర్ఎస్ సన్నద్ధం అవుతున్నది. కేసీఆర్ నాయకత్వం, బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తనను గెలిపిస్తాయని గాలి అనిల్‌కుమార్ నమ్మకంగా చెబుతున్నారు.


కవయిత్రి మొల్లమాంబ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

'మొల్ల' జీవితం ఆదర్శం

- రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్
- హుస్నాబాద్‌లో మొల్లమాంబ క్యాలెండర్ ఆవిష్కరణ

హుస్నాబాద్, మార్చి 14: కుమ్మరి కుటుంబంలో జన్మించి సంస్కృతంలో ఉన్న రామాయణాన్ని తెలుగులోకి అనువదించిన కవయిత్రి మొల్లమాంబ మహిళా లోకానికి ఆదర్శం అని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కవయిత్రి మొల్లమాంబ జయంతి వారోత్సవాలను పురస్కరించుకొని బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు రూపొందించిన మొల్లమాంబ క్యాలెండర్‌ను హుస్నాబాద్‌లోని తన నివాసంలో మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువు అంటే తెలియని రోజుల్లోనే పట్టుదలతో చదివి రామాయణాన్ని అనువదించిన ఘనత మొల్లమాంబదేనన్నారు. ఆమె చేసిన సేవలు తరాలు మారినా చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. మొల్లమాంబ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు, ఉపాధ్యక్షుడు, కుమ్మర సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు టీకే శ్రీనివాస్ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కుమ్మర సంఘం నాయకుడు మల్లెల రామనాథ, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు నార్లపురం చంద్రమౌళి, హుస్నాబాద్ సంఘం నాయకులు నమిలికొండ రాజయ్య, బెక్కంటి భీమయ్య, నమిలికొండ అయిలయ్య, రాదారపు శ్రీనివాస్, జగదీశ్వర్, ఇటికాల స్వామి, ఇటికాల మొండయ్య, మహేందర్, ఎల్లయ్య, యాదగిరి, తిరుమలేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి జరగాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలి

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్

నారాయణఖేడ్, మార్చి 14: జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి జరగాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాల్సిన ఆవశ్యకతను ప్రజలు గుర్తించాలని జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన నారాయణఖేడ్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డితో కలిసి నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. బీజేపీ తెలంగాణ అభివృద్ధికి ఏమాత్రం సహకరించడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రజల గొంతుకగా మారి ప్రశ్నిస్తున్నదన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కేసీఆర్ నేతృత్వంలో తాను పోరాడానని గాలి అనిల్‌కుమార్ గుర్తు చేశారు. తనను జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించిన కేసీఆర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రైతుబిడ్డను, తెలంగాణ ఉద్యమకారుడినైన తనను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. గాలి అనిల్‌కుమార్‌ను మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ నేత మల్కాపురం శివకుమార్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గాలి అనిల్‌కుమార్‌ను సన్మానిస్తున్న నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నూతన టెక్నాలజీతో యుద్ధట్యాంకులు

కంది, మార్చి 14: సంగారెడ్డి జిల్లా కంది ఓడీఎఫ్‌లో తయారుచేసిన బీఎంపీ-2 యుద్ధ ట్యాంకులకు అధునాతన మార్పులు చేసి నూతన టెక్నాలజీ జోడించనున్నది. ఈ మేరకు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖతో గురువారం ఓడీఎఫ్ (ఏవీఎన్ఎల్) సీఎండీ సంజయ్ ద్వివేది ఒప్పందం చేసుకున్నారు. ఓడీఎఫ్‌లో తయారు చేసిన బీఎంపీ-2 యుద్ధ ట్యాంకులు కొన్ని రక్షణ రంగానికి అందజేశారు. ఈ ట్యాంకుల్లో మార్పులు చేయాలని రక్షణ రంగం కోరిన మేరకు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు.

ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఓడీఎఫ్ (ఏవీఎన్ఎల్) సీఎండీ సంజయ్ ద్వివేది